సనత్‌నగర్ ప్రజల రుణం తీర్చుకోలేనిది



స్థానికుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గవాసులు అసెంబ్లీ ఎన్నికల్లో తనపై చూపిన ఆదరణతో వారి రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని బీజేఆర్ నగర్, ఎంసీహెచ్ క్వార్టర్స్, డీ–క్లాస్, అరుణ్‌జ్యోతి కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కారం.. సనత్‌నగర్ నియోజక వర్గం సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతానన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల కారణంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. నిధులు మంజూరై ప్రారంభం కాని అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో స్థానిక ప్రజలు తమ బస్తీలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం మార్చాలని, స్వామి వివేకానంద కమ్యూనిటీహాల్ సమీపంలోని ఖాళీ స్థలంలో పార్కు నిర్మాణాలను చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యే స్థానికంగా రూ. 10.5 లక్షల వ్యయంతో చేపట్టినున్న సీవరేజీ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, పవన్‌కుమార్ గౌడ్, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్, ఏడీఈ క్రిష్ణ, జలమండలి అధికారులు శశాంక్, మేనేజర్ సంధ్య, బీఆర్ఎస్ నాయకులు వెంకటేషన్, లక్ష్మీపతి, అబ్బాస్, ప్రేమ్, కుమార్ యాదవ్, రజాక్, ఫయీమ్, నర్సింగ్‌రావు, బలరామ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మెట్లబావిలో సంగీత ప్రదర్శన



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ మెట్ల బావి వద్ద మెస్మరైజింగ్ జుగల్‌బందీ సంగీత ప్రదర్శన కార్యక్రమం అలరించింది. సాంస్కృతిక వారసత్వం ప్రచారం 10వ సంవత్సరం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గుడి సంబరాల వ్యవస్థాపకులు శశిరెడ్డి పేర్కొన్నారు. పేరి త్యాగరాజు, కె. నంద్‌కుమార్ ప్రఖ్యాత కళాకారులు తమ అద్భుత కళా ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా గుడి సంబరాలు వ్యవస్థాపకులు శశిరెడ్డి మాట్లాడుతూ.. వారసత్వ సంపదలను పరిరక్షణ ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. సంగీతం, నృత్యాల మాయాజాలం ద్వారా పురాతన కథలను పునరుజ్జీవింపజేస్తామన్నారు.

ప్రాచీన కట్టడాలు..

కనుమరుగవుతున్న చారిత్రక కట్టడాలు

కబ్జాకోరల్లో కొన్ని.. శిథిలావస్థలో మరికొన్ని..

పరిరక్షిస్తే మేలు!



- పరిరక్షిస్తూ, మరమ్మతులు చేయాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు



కూలిపోయిన ప్రాచీన కోట గోడ

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో ఉన్న నిజాం కాలం నాటి చారిత్రక కట్టడాలు శిథిలావస్థలకు చేరాయి. ఇదే అదనుగా భావించి కబ్జాదారులతో వాటికి ప్రమాదం పొంచి ఉంది. చరిత్రకు సాక్ష్యాలుగా ఉండాల్సిన నిర్మాణాలు రోజుకోటి చొప్పున కనుమరుగవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని లాలాపేట వాసులు వాపోతున్నారు. ప్రాచీన కట్టడాలకు నిలయమైన లాలాపేట అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుని వాటిని పరిరక్షిస్తూ మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కోటలకు బీటలు..

నేటి పాత లాలాపేట ప్రాంతం చుట్టూ ఆరు వైపులా బుర్జులు, నాలుగు వైపులా పెద్ద పెద్ద దర్వాజాలు, నడి మధ్యలో నిజాం గడికోట ఉండేది. ఆనాడు గోల్కొండ కోట నుంచి పాలన కొనసాగించిన నిజాం ప్రభువు ప్రతి ఏటా మౌలాలీ దర్గాలో జరిగే ఉర్సు వేడుకలకు వెళ్లేవారు. ఈ మార్గమధ్యలోనే లాలాపేట గడి ఉంది. లాలమ్మ అనే నాట్యగత్తె నాట్యంతో లాలాపేట గడిలో సేద తీరేవారని నానుడి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల కొనసాగుతున్నదే నాటి నిజాం పాలకుల గడికోట. అయితే కాలక్రమేణ ఈ నిర్మాణాలను పరిరక్షించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా లాలాపేట చుట్టూ ఉన్న బుర్జుల్లో కొన్ని నేలమట్టం కాగా ప్రహరీ కనుమరుగై అక్కడక్కడా కొంత కనిపిస్తోందని వాటిపై నిఘా పెట్టకపోతే అది కూడా భూస్థాపితం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.



నిజాం కాలంనాటి నిర్మాణంపై పెరిగిన చెట్లు

పెచ్చూడిన నిర్మాణం

ఏపుగా పెరిగిన చెట్లు..

నిజాం కాలం నాటి కోట గోడ, బుర్జులు, దర్వాజల పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవడంతో వాటిపై ఏపుగా పెరిన చెట్లు, వృక్షాలు, పిచ్చిమొక్కలతో భూత్ బంగ్లాలా మారాయి. ఏపుగా పెరిగిన వృక్షాలు, చెట్ల వేర్లతో నిర్మాణాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ నిర్మాణాలకు రక్షణ లేకుండా పోయింది. అదను చూసి ఆక్రమించుకోవాలనే చేసే వారు ఉన్నారు. లాలాపేటలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణలో ప్రాచీన కాలం నాటి దర్వాజ బయటికి వచ్చింది. ఈ దర్వాజను ఆనుకుని ఉన్న కోట గోడకు సైతం ప్రమాదం పొంచి ఉంది. చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఈ దర్వాజను కూల్చివేస్తారా లేదా అలాగే కొనసాగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల రోడ్డు విస్తరణ కూల్చివేతల్లో భాగంగా నిజాం కాలం నాటి ప్రహరీకి బీటలు వారాయి.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 58, పందిరి బీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 37, దొండ 40, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 60, గోకరకాయ 60, కీర 15, దోసకాయ 40, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6.

ఎమ్మెల్యేలకు శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే తలసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: నూతన సంవత్సరం సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. మత్స్యశాఖ ఉన్నతాధికారులు మురళీకృష్ణ, మహిపాల్, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములుయాదవ్, సభ్యులు గుడిగే శ్రీనివాస్‌యాదవ్, బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, నాయకులు శ్రీహరి, శేఖర్, ఆరీఫ్, మొహిన్, ఎస్ఆర్‌నగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్, సహదేవ్‌గౌడ్, మాధవరావు, అరవింద్, బిచ్చప్ప ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

అమీర్‌పేట: అమీర్‌పేటకు చెందిన సీనియర్ నాయకులు ఎం.లలిత చౌహాన్, గోపీలాల్‌చౌహాన్, గులాబ్‌సింగ్, హరిసింగ్ జాదవ్ మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే తలసాని నివాసానికి వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను మంగళవారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓడియన్ శ్రీను, జాకీర్, అశోక్, పెంటయ్య పాల్గొన్నారు.

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ మంగళవారం ఎమ్మెల్యే పద్మారావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.



రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని సీనియర్ నాయలు బేగంపేట రమేష్ ఆధ్వర్యంలో అంబాటి అర్జున్, మందురి సాంబశివరావు, గంగపుత్ర రాజన్న, విజయకుమార్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, సిటీబ్యూరో

దరఖాస్తులకు తగ్గని జోరు!

కిటకిటలాడుతున్న ప్రజాపాలన కేంద్రాలు

సనత్‌నగర్: బేగంపేట సర్కిల్ పరిధిలో నాలుగు డివిజన్లలో 16 ప్రజాపాలన కేంద్రాలు, ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలో ఎనిమిది కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. షెడ్యూల్ ప్రకారం మంగళవారం నిర్దేశిత కాలనీలు, బస్తీవాసుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అభయహస్తం గ్యారెంటీ పథకాలతో పాటు తెల్ల రేషన్‌కార్డులు కావాలంటూ పెద్ద సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు.

నేడు దరఖాస్తులు స్వీరించే బస్తీలు ఇవే..

- బన్సీలాల్‌పేట డివిజన్‌లోని నాలుగు కేంద్రాల ద్వారా బుధవారం జీకేకాలనీ, అభినవ్‌నగర్‌కాలనీ, అరుణ్‌జ్యోతినగర్, భోలక్‌పూర్ బస్తీల నివాసితుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు.
- రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని నాలుగు కేంద్రాల ద్వారా జీరా, ఆవులమంద, ధన్‌బజార్, డీవీకాలనీ ప్రాంత నివాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.
- బేగంపేట డివిజన్‌లోని నాలుగు కేంద్రాల ద్వారా ఎస్‌బీటీనగర్, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కాలనీ, మెజిస్టిక్ మాన్షన్, శ్యాంలాల్ బిల్డింగ్స్ వాసుల నుంచి స్వీకరిస్తారు.
- మోండా డివిజన్‌లో ఏర్పాటుచేసిన నాలుగు కేంద్రాల ద్వారా రెజిమెంటల్ బజార్ వెస్ట్, మోండా మార్కెట్ పార్ట్, సెకండ్ బజార్, ఈస్ట్ మారేడ్‌పల్లి, దిల్‌దార్ లేఅవుట్ ప్రాంత ప్రజల నుంచి స్వీకరిస్తారు.
- ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని అమీర్‌పేట డివిజన్‌లోని నాలుగు కేంద్రాల ద్వారా సైంటిఫిక్ కాలనీ, సీ–టైప్ క్వార్టర్స్, సంజీవరెడ్డినగర్, డీకేరోడ్డు, కుమ్మరిబస్తీ వాసుల నుంచి స్వీకరిస్తారు.
- సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని నాలుగు కేంద్రాల ద్వారా కైలాష్‌నగర్, ఎల్‌ఐజీహెచ్ కాలనీ, ఆదిత్యనగర్ కాలనీ, శ్యామలకుంట బస్తీ, బీకేగూడ, జెక్ కాలనీ ప్రాంత ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని అధికారులు వెల్లడించారు.



మాణికేశ్వర్‌నగర్‌లోని కేంద్రంలో..

తార్నాక డివిజన్‌లో..

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరుతో నిర్వహిస్తున్న ప్రజాపాలన రెండు రోజుల విరామం తర్వాత మంగళవారం పునఃప్రారంభమైంది. తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వర్‌నగర్, తార్నాక నాగార్జున నగర్, లాలాపేట వినోభానగర్, తార్నాక వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలకు దరఖాస్తులను సమర్పించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. మాణికేశ్వర్‌నగర్ కేంద్రంలో 1173, తార్నాక వార్డు కార్యాలయం కేంద్రంలో 1244, నాగార్జున నగర్ కేంద్రంలో 170, వినోభానగర్ కేంద్రంలో 400 మంది దరఖాస్తులను సమర్పించారు. ఆరు గ్యారంటీలతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.



సనత్‌నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద బారులుతీరిన దరఖాస్తుదారులు

ఇంధన భయం.. పోటెత్తిన జనం



లాలాపేట: దేశవ్యాప్తంగా పెట్రోల్ ట్యాంకర్ల యజమానులు సమ్మె చేస్తుండటంతో రెండు, మూడు రోజుల పాటు పెట్రోల్ బంక్‌లు బంద్ పాటిస్తున్నాయని వార్తలు ప్రజల్లో తీవ్ర కలకలం రేపాయి. మూడు రోజుల పాటు పెట్రోల్, డీజిల్ సరఫరా నిలిచిపోతుందని భావించిన వాహనదారులు భారీగా పెట్రోల్ బంక్‌లకు పరుగులు పెట్టారు. తార్నాక చౌరస్తా, లాలాపేట, మాణికేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంక్‌లకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, ఇతర వాహనదారులు తరలి రావడంలో బంక్‌లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. దూరప్రాంతాల నుంచి వాహనదారులు తరలిరావడంతో వాహనదారులను అదుపు చేయలేక కొన్ని బంక్‌లలో నో స్టాక్ బోర్డు పెట్టారు.

సికింద్రాబాద్‌లో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని ఎస్పీరోడ్, ఎస్డీరోడ్డు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ఎస్పీరోడ్డు ప్లాజా జంక్షన్ వద్ద ఉన్న భారత్ పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు బారులుతీరి రోడ్డు పైకి రావడంతో ట్రాఫిక్ జామైంది. ప్యారడైజ్ చౌరస్తా, ప్యాట్నీ సెంటర్, సంగీత్ చౌరస్తా, ఆల్ఫా హోటల్ ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. బంక్‌ల వద్ద వాహనదారులను అదుపు చేసేందుకు పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొద్ది గంటల్లోనే బంకుల్లో ఉండే పెట్రోల్, డీజిల్ అయిపోవడంతో నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. సాయంత్రం 7గంటల వరకు స్టాక్ రావడంతో మళ్లీ సాధారణ పరిస్థితి నెలకొంది.



ఎస్పీరోడ్డులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద కిక్కిరిసిన వాహనదారులు



దరఖాస్తుదారులకు ఇబ్బందులు రానివ్వం

అడ్డగుట్ట: దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాల సౌకర్యాలు అందిస్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేణు మాధవ్ తెలిపారు. అడ్డగుట్ట డివిజన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన అభయ హస్తం కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఆరు గ్యారంటీ దరఖాస్తు ఫారాలను నింపేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల కోసం హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామని అంతేకాక కేంద్రాలకు వచ్చే వృద్ధులు, సరైన అవగాహన లేని వారికి అక్కడున్న వలంటీర్లు ఫారాలు నింపేందుకు సహాయం చేస్తున్నారన్నారు. మొదటి రెండ్రోజుల్లో కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు వచ్చారని, ప్రస్తుతం రద్దీ లేకుండా ప్రశాంతంగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేంద్రాల వద్దనే దరఖాస్తు ఫారాలు ఇస్తున్నారని, అవసరమైతే వాటిని నింపేందుకు వలంటీర్లు కూడా సహాయ పడుతున్నారన్నారు. ఆయన వెంట కేంద్రం నిర్వాహకులు వెంకటరమణ, అష్రఫ్, కాంగ్రెస్ సీనియర్ నేత గంట రాజుసాగర్, కృష్ణారావు, వెంకటేష్, అమర్, జీహెచ్ఎంసీ సిబ్బంది అఖిల్, గబ్బర్, బీఆర్ఎస్ నాయకురాలు గీతా దయాకర్, ఖదీర్, యాదుల్లా ఉన్నారు.

నూతన వేడుకల్లో ఎమ్మెల్యే



కేక్‌కట్ చేస్తున్న తలసాని

పద్మారావునగర్: బన్సీలాల్ పేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని పాల్గొని కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది అందరి జీవితాల్లో ఆనందం నింపాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కేక్ తినిపించారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

బాలయ్య సేవలు చిరస్మరణీయం



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట రజక సంఘం వ్యవస్థాపకులుగా రజకుల సంక్షేమానికి వట్టిపల్లి బాలయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు రజక సంఘం నాయకులు కొనియాడారు. మంగళవారం లాలాపేటలోని ధోబీఘాట్‌లో బాలయ్య 9వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి బాలయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లాలాపేట సంఘం నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు దుప్పట్ల పంపిణీ



చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా అయ్యప్ప మాలాధారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలి నుంచి రక్షణ కల్పించేందుకు ప్రతి ఏటా అయ్యప్ప మాలధారులకు దుప్పట్లు అందిస్తున్నట్లు తెలిపారు. నాలుగూరి వెల్ఫేర్ అసోషియేషన్ ద్వారా పలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చిలకలగూడ, పార్శిగుట్ట, కిందిబస్తీ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, బౌద్ధనగర్, సికింద్రాబాద్, హమాలీబస్తీ తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది మాలధారులు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మశ్రీను, సతీష్, ఆంజనేయులు, ప్రమోద్, అంజిదేవుడు, వెంకట్, బాబు, రవిశంకర్ పాల్గొన్నారు.

అభినందనలు

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన దీపదాస్ మున్షీని సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలతో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరామ అక్షింతల వితరణ




అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

సనత్‌నగర్: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ సరఫరా చేసిన శ్రీరామ అక్షింతలను మోడల్‌కాలనీ, సుందర్‌నగర్‌లో వితరణ చేశారు. ఆయా కాలనీల వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి గడప గడపకూ అందజేశారు. మోడల్‌కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, సాయిప్రశాంత్, జేఎస్‌టీశాయి, రాజేశ్వరి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

అమీర్‌పేట: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్ సమీపంలోని బాపూనగర్‌కు చెందిన బిక్కీబాయి (71) గత కొంతకాలంగా కడుపులో కేన్సర్‌తో బాధ పడుతోంది. కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో చికిత్స చేయిస్తున్నారు. డిసెంబర్ 31వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొన్న బిక్కీబాయి అదే రాత్రి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు పవన్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ రాంప్రసాదరావు తెలిపారు.

కుమార్తెతో సహా తల్లి అదృశ్యం



లాలాపేట: కుమార్తెతో సహా తల్లి అదృశ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపంలోని వెంకటపల్లి తండా ప్రాంతానికి చెందిన సురేష్ నాయక్, సాలూబాయి(28) తార్నాకలోని ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్నారు. సురేష్‌నాయక్ తండ్రి అనారోగ్యంతో చికిత్సపొందుతూ గత డిసెంబర్ 29న మరణించాడు. తండ్రి అంత్యక్రియల నిమిత్తం సురేష్ నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడ సాలుబాయి గురించి పుట్టింటి వారు అడగ్గా సాలుబాయికి తనకు గత నెల 26న గొడవ జరిగిందని నేను హాస్పిటల్‌లోనే ఉన్నాను ఆమె ఇంటికి వెళ్లి ఉండొచ్చని సురేష్ నాయక్ చెప్పాడు. కుటుంబ కలహాలతో తన మూడేళ్ల కూతురితో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.